# కోశ విధానాలు... ఆర్థిక సంఘం సిఫార్సులు..

ప్రపంచ ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం విస్తరణ కోశ విధానాన్ని అవలంబించింది. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక మద్దతు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్యలోటు పెరిగింది. 2007-08లో అన్ని రాష్ట్రాల ద్రవ్యలోటు జీడీపీలో 1.4 శాతం కాగా 2009-10లో ఇది 3.2 శాతానికి పెరిగింది. ప్రభుత్వం ప్రకటించిన పన్ను రాయితీలు (ట్యాక్స్ కట్స్) ద్రవ్యలోటు పెరగడానికి కారణమయ్యాయి. 1990-91 నుంచి జీడీపీ-పన్ను నిష్పత్తి స్థంభించింది. పన్ను నిర్మాణతలో వచ్చిన మార్పుల కారణంగా ప్రత్యక్ష పన్నుల రాబడి పెరగడం భారత ఆర్థిక వ్యవస్థలో శుభ పరిణామంగా భావించవచ్చు. 2008-09లో మొత్తం పన్నుల రాబడిలో ప్రత్యక్ష పన్నుల వాటా 55.5 శాతానికి చేరుకుంది.

### కోశ విధానం:

ఆర్థిక వృద్ధి, సమానత, ఆర్థిక స్థిరీకరణ సాధించే దిశగా ఆర్థిక వ్యవస్థను నియంత్రించే విధానమే కోశవిధానం. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న ప్రభుత్వ విధుల కారణంగా కోశ విధాన పాత్ర పెరిగింది. ద్రవ్య విధాన వైఫల్యం కూడా కోశ విధాన ప్రాధాన్యతను పెంచింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక స్థిరీకరణ ప్రభుత్వ వ్యయ విధానం ద్వారా సాధ్యమవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వనరుల సమీకరణ ఒక పెద్ద ప్రతిబంధకంగా మారింది. ఈ నేపథ్యంలో 'క్రియాశీలక ఆర్థిక విధానం' ద్వారా వనరులను సమీకరించవచ్చు. అంతేకాకుండా పన్ను విధానం, రుణ విధానం, లోటు బడ్జెట్ విధానం ద్వారా కూడా ఆర్థిక వృద్ధి, స్థిరీకరణను సాధించవచ్చు.

సంప్రదాయికంగా కోశ విధానం అంటే ఆదాయ, వ్యయ విధానాలుగా భావించేవారు. కానీ ఆధునిక యుగంలో కోశ విధానం రూపురేఖలు మారిపోయాయి. అభివృద్ధిని వేగవంతం చేయడానికి రుణాలు సమీకరించడం, లోటు బడ్జెట్ వంటి విధానాలను ప్రభుత్వం అవలంబిస్తోంది. కోశ విధానం ఆర్థిక లక్ష్యాల పరంగా మార్కెట్ వ్యవస్థ పనితీరును నియంత్రిస్తోంది. దేశంలో ఆర్థిక స్థిరత్వం, మార్కెట్ శక్తులు, కోశ విధాన సాధనాలను సక్రమంగా వినియోగించుకోవడం, వాణిజ్య స్థితి, విదేశీ మూలధనం వంటి అంశాలపై కోశ విధాన విజయం ఆధారపడి ఉంటుంది. కోశ విధానాన్ని ఒక బడ్జెట్ విధానంగా కూడా పేర్కొనవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక వృద్ధికి మూలధన సంచయనం ఎంతో అవసరం. అంతేకాకుండా ఈ దేశాలలో పొదుపు, తలసరి ఆదాయాలు తక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో కోశ విధానం ద్వారా పొదుపును ఉత్పాదక రంగాల వైపు మరలిస్తే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. పన్ను విధానం ద్వారా ప్రైవేటు వినియోగాన్ని తగ్గించి నిరుపయోగంగా ఉన్న వనరులను పెట్టుబడిగా బదిలీ చేయవచ్చు. ఆర్థిక ప్రణాళికలను అమలు చేయడం, నిజ, ద్రవ్య విషయంగా సమతుల్యాన్ని సాధించడానికి కోశ విధానంపైనే ఎక్కువగా ఆధారపడాలని ప్రముఖ ఆర్థికవేత్త రాజా చెల్లయ్య అభిప్రాయపడ్డారు.

### కోశ విధాన సాధనాలు:

- పన్ను విధానం ● ప్రభుత్వ వ్యయ విధానం,
- ప్రభుత్వ రుణ విధానం ● లోటు బడ్జెట్ విధానం

భారతదేశంలో 1951లో ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి ప్రారంభమైన నేపథ్యంలో ఒక అభిలషణీయమైన కోశ విధానానికి ఉండాల్సిన లక్ష్యాలు.

- ఆదాయ సంపదల లో వ్యత్యాసాలను తొలగించాలి.
- ప్రాంతీయ అసమానతలను తగ్గించాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పెట్టుబడిని ప్రోత్సహించాలి.
- ఆర్థికవృద్ధి నిమిత్తం పొదుపు రేటు పెంచాలి.
- ధరల స్థిరత్వాన్ని సాధించాలి.
- పూర్ణోద్యోగిత సాధించాలి.
- పేదరికాన్ని, నిరుద్యోగాన్ని నివారించాలి.
- ఆర్థికాభివృద్ధి కోసం అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ
- ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం ద్వారా సమ సమాజ స్థాపనకు కృషి చేయాలి

అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్య, మూలధన మార్కెట్ అంతగా అభివృద్ధి చెందని కారణంగా కోశ విధానాన్ని ద్రవ్య విధానంతో అనుసంధానించినపుడే స్థూల ఆర్థిక విధాన లక్ష్యాలు సాధ్యమవుతాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమీకరించిన రుణాలను రెవెన్యూ వ్యయం కోసం ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వ వ్యయ విధానంలో కఠినమైన నిబంధనలు లేకపోవడంతో రెవెన్యూ, ద్రవ్యలోటులు పెరుగుతున్నాయి. ప్రభుత్వం అవలంబిస్తున్న లోటు విధానం వల్ల ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి వినియోగం తగ్గుతుంది. తద్వారా సమష్టి డిమాండ్ తగ్గి ఆర్థికాభివృద్ధికి ప్రతిబంధక పరిస్థితులు ఏర్పడతాయి.

### 13వ ఆర్థిక సంఘం సిఫార్సులు:

- కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాల సంఖ్యను తగ్గించాలి.
- విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న నష్టాలను సమయ నిర్దేశిత (టైమ్ బౌండ్) ప్రాతిపదికన నివారించాలి.
- 2010-11 – 2014-15 మధ్య కాలంలో ప్రతి ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటా 32 శాతంగా ఉండాలి.
- కేంద్ర ప్రభుత్వం తన రెవెన్యూ లోటును తగ్గించుకుంటూ 2014-15 నాటికి రెవెన్యూ మిగులు సాధించాలి.
- 2014-15 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి రుణం

జీడీపీలో 68 శాతానికి మించరాదు.

- మీడియం టర్మ్ ఫిస్కల్ ప్లాన్ (మధ్య కాలిక ద్రవ్య ప్రణాళిక)ను సంస్కరించాలి.
- 2007-08లో రెవెన్యూ మిగులు లేదా జీరో రెవెన్యూ లోటు ఆర్జించిన రాష్ట్రాలు 2011-12 నాటికి రెవెన్యూ మిగులు ఆర్జించాలి. మిగతా రాష్ట్రాలు 2014-15 నాటికి తమ రెవెన్యూ లోటును పూర్తిగా నివారించుకోవాలి.
- జాతీయ చిన్న మొత్తాల పొదుపు పథకాన్ని సంస్కరించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలు తమ లోకల్ ఫండ్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌ల పనితీరును పటిష్టపరుచుకోవాలి.
- ఎనిమిది రాష్ట్రాలకు ప్రణాళికేతర రెవెన్యూ గ్రాంటు కింద రూ.51,800 కోట్లు మంజూరు చేయాలి.
- రాష్ట్రాలకు ప్రాథమిక విద్యకు సంబంధించి గ్రాంటుగా రూ. 24,068 కోట్లు కేటాయించాలి.
- అటవీ అభివృద్ధి కోసం రాష్ట్రాలకు రూ.5000 కోట్లు కేటాయించాలి.
- 2011-12 నుంచి 2014-15 మధ్యకాలంలో నీటి యాజమాన్యం కోసం రాష్ట్రాలకు రూ.5000 కోట్లు.
- 2011-12 నుంచి 2014-15 మధ్య కాలంలో రోడ్లు, వంతెనల నిర్వహణకు రాష్ట్రాలకు రూ.19,930 కోట్లు.
- రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక అవసరాల నిమిత్తం రూ.27,945 కోట్లు.
- 2013-14 నాటికి మణిపూర్, నాగాలాండ్, సిక్కిం, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు తమ ద్రవ్యలోటును జీఎస్‌డీపీలో 3 శాతానికి తగ్గించుకోవాలి.
- వస్తు సేవలపై పన్ను నమూనా అమలుకు రాష్ట్రాలకు రూ.50,000 కోట్లు కేటాయించాలి.

## నమూనా ప్రశ్నలు

1. జాతీయ రుణంగా దేనిని పరిగణించరు?
   ఎ) లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు
   బి) జాతీయ పొదుపు సర్టిఫికెట్లు
   సి) దీర్ఘకాల ప్రభుత్వ బాండ్లు
   డి) ప్రావిడెంట్ ఫండ్
2. దీర్ఘకాల కోశ విధానాన్ని మొదట ప్రకటించింది?
   ఎ) 19 డిసెంబర్, 1984 బి) 19 డిసెంబర్, 1985
   సి) 19 డిసెంబర్,1986 డి) 15 ఆగస్ట్, 1986
3. మొదటి ఆర్థిక సంఘం (1952-57) అధ్యక్షులు?
   ఎ) కె.సంతానం బి) కె.సి.నియోగి
   సి) వై.బి.చవాన్ డి) కె.సి.పంత్
4. ప్రాథమిక లోటు అంటే..?
   ఎ) ద్రవ్యలోటు-వడ్డీ చెల్లింపులు
   బి) ద్రవ్యలోటు+వడ్డీ చెల్లింపులు
   సి) బడ్జెట్ లోటు+నికర వడ్డీ చెల్లింపులు
   డి) బడ్జెట్ లోటు-నికర వడ్డీ చెల్లింపులు
5. వ్యవసాయ ఆదాయంపై పన్నును సిఫార్సు చేసిన కమిటీ?
   ఎ) చెల్లయ్య కమిటీ బి) రేకీ కమిటీ
   సి) వై.వి.రెడ్డి కమిటీ డి) కె.ఎన్.రాజ్ కమిటీ
6. కోశ విధానం దీనికి సంబంధించింది?
   ఎ) పరిశ్రమలు బి) ప్రభుత్వ ఆదాయం, వ్యయం
   సి) విదేశీ వాణిజ్యం డి) కరెన్సీ నోట్ల ముద్రణ
7. 'జీరో బేస్డ్ బడ్జెట్' విధానాన్ని ఎప్పటి నుంచి తీసుకున్నారు?
   ఎ) ఏప్రిల్ 1, 1987 బి) ఏప్రిల్ 1, 1989
   సి) ఏప్రిల్1, 1991 డి) ఏప్రిల్ 1,1999
8. 2010-11 కేంద్ర బడ్జెట్‌లో కనీస ప్రత్యామ్నాయ పన్ను (ఎంఏటీ)ను ఎంత శాతంగా నిర్ణయించారు?
   ఎ) 15 బి) 17 సి) 18 డి) 19
9. 2010-11 కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు?
   ఎ) రూ.1,55,000 బి) రూ.1,60,000
   సి) రూ.1,70,000 డి) రూ.1,75,000
10. 2010-11లో ప్రత్యక్ష పన్నులకు సంబంధించి కొత్త ప్రతిపాదనల కారణంగా ఎంత మేరకు రెవెన్యూ నష్టం ఉండగలదు?
    ఎ) రూ.15000 కోట్లు బి) రూ.17000 కోట్లు
    సి) రూ.20000 కోట్లు డి) రూ. 26000 కోట్లు
11. 12వ ఆర్థిక సంఘం అధ్యక్షులు?
    ఎ) విజయ్ శేఖర్ బి) రంగరాజన్
    సి) సాల్వే డి) సంతానం
12. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం ఉండాల న్నదెవరు?
    ఎ) ఆడమ్‌స్మిత్ బి) పిగూ
    సి) రాబర్ట్ సన్ డి) కీన్స్
13. 13వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వ పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటా?
    ఎ) 32 శాతం బి) 33 శాతం
    సి) 34 శాతం డి) పైవేవీ కాదు
14. పేద ప్రజలకు పన్ను విధింపు నుంచి 'ధార్మికంగానూ, ఆర్థికంగానూ' మినహా యింపు ఇవ్వాలన్నదెవరు?
    ఎ) పాల్ క్రూగ్‌మన్ బి) రాబర్ట్ సన్
    సి) కీన్స్ డి) పిగూ
15. సంతులిత బడ్జెట్ అవసరాన్ని చెప్పింది?
    ఎ) సంప్రదాయ సిద్ధాంతకులు బి) ఆధునిక సిద్ధాంతకులు
    సి) శామ్యూల్ సన్ డి) మార్షల్
16. ప్రణాళికేతర వ్యయంలో ఉండే అంశం?
    ఎ) రక్షణ రెవెన్యూ వ్యయం బి) పోస్టల్ లోటు
    సి) రైతుల రుణ విమోచన డి) పైవన్నీ
17. న్యాయసమ్మతమైన అసమానతలను కొంతమేరకు సహించి, న్యాయసమ్మతం కానటువంటి అసమానతలను తప్పనిసరిగా నివారించాలన్నదెవరు?

ఎ) ఆర్.ఎన్.త్రిపాఠి    బి) వై.వి.రెడ్డి

సి) వై.బి.చవాన్    డి) రణదేవ్

18.ప్రభుత్వ వ్యయాన్ని మూలధన వస్తు పరిశ్రమలపై వెచ్చిస్తే అసమానతలు పెరుగుతాయన్నదెవరు?

ఎ) కె.ఆర్.రణదేవ్    బి) త్రిపాఠి

సి) శామ్యూల్‌సన్    డి) ఆడమ్‌స్మిత్

19.కింది వాటిలో పరోక్ష పన్ను కానిది?

ఎ) అమ్మకం పన్ను    బి) ఎక్సైజ్ పన్ను

సి) ఆదాయపు పన్ను    డి) దిగుమతి పన్ను

20.అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయ అసమానతలు రూపుమాపడానికి ఎటువంటి పన్నుల విధానం అవసరం?

ఎ) తిరోగామి    బి) పురోగామి

సి) అనుపాత    డి) పైవేవీ కాదు

21.బహుమతి పన్ను ప్రవేశపెట్టిందెవరు?

ఎ) ఆడమ్ స్మిత్    బి) మాథుర్

సి) కె.సి.పంత్    డి) కాల్డర్

22.ఆడమ్ స్మిత్ పన్ను సూత్రాలకు సంబంధించింది?

ఎ) పొదుపు సూత్రం    బి) వ్యాకోచ సూత్రం

సి) సౌలభ్య సూత్రం    డి) నిశ్చయ సూత్రం

23.ప్రత్యక్ష పన్నుల కమిటీ అధ్యక్షులు?

ఎ) కేల్కర్    బి) రేఖీ

సి) వాంఛూ    డి) మాథుర్

24.'ప్రభుత్వ విత్తం' అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించిన దేశం?

ఎ) ఫ్రాన్స్    బి) ఇంగ్లండ్

సి) భారత్    డి) రష్యా

**సమాధానాలు**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | డి | 2 | బి | 3 | బి | 4 | ఎ |
| 5 | డి | 6 | బి | 7 | ఎ | 8 | సి |
| 9 | బి | 10 | డి | 11 | బి | 12 | డి |
| 13 | ఎ | 14 | సి | 15 | ఎ | 16 | డి |
| 17 | ఎ | 18 | ఎ | 19 | సి | 20 | బి |
| 21 | డి | 22 | బి | 23 | సి | 24 | బి |